ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక: 5.7.1985

# కరణం పోటు

కరణం పాపయ్య ఇల్లు ఊరి మధ్యలో వుంది. ఇంట్లో పెద్ద వేప చెట్టు. ఆ చెట్టు క్రింద కరణీకం కరారావుడీ కాక ముందు కచేరీ ఉండేది. పడక కుర్చీలో విక్రమార్క మహారాజులా కూర్చుంటే, మునసబు ప్రక్కనే కుర్చీలో సామంత రాజులా కూర్చుండేవాడు. మోతాదు, మాబు, సైన్యాధిపతిలా, బాణా కర్రతో నిలబడి వుండేవాడు. ఇక వెట్టోళ్ళు వెంకడూ, దావీదూ భటులు. అలా చక్రం తిప్పాడు పాపయ్య ఆ వేపచెట్టు క్రింద కొన్నేళ్ళుగా!

రోజులు మారాయి! గ్రామాధికారులు, మాజీ మహారాజులైనారు. కవిలె కట్ట పాయ్యే సరికి మునసబు వెంకటాచలం, 'పోతే పోయింది. పెంట' అని చేతులు దులుపుకుని

వ్యవసాయం చేసుకోసాగాడు. కరణం పాపయ్యకు ఏం చెయ్యాలో తోచడం లేదు.

కరణీకం పొయ్యేసరికి అధికారం పోయింది. దాంతో పాడి ఆవు లాంటి ఆదాయం పోయింది. ఇదివరకు తెల్లారిందగ్గర్నుంచీ కరణంగారితో మాట్లాడేందుకు రైతులు, పల్లెజనం చేతులు గట్టుకు వేచి ఉండేవాళ్ళు.

"ఏమొయ్! మీ మిరపతోట బాగుందే" అనంటే చాలు, ఆ పొలం యజమాని మర్రోజు కల్లా ఓ బుట్టెడు పండు మిరపకాయలు పంపేవాడు. అలాగే కందులు, మినుములు - ఇలా గ్రామ కంఠంలో ఏ పంట పండితే అందులో కరణంగారికి భాగ ముండేది.

ఇక పొలం కొలతలు, దస్తావేజులు వ్రాయడం, బ్యాంకు వారిచ్చే అప్పులకు పొలం వివరాలు అందించడం, ప్రోనోట్లు వ్రాయడం, నీటి తగాదాలు - ఇలా పాపయ్యకు చేతి నిండా పని వుండేది.

కరణంగారు పై పంచె వేసుకుని కత్తెర మార్కు సిగరెట్ కాలుస్తూ ఊళ్ళో గుండా నడుస్తుంటే ఆడవాళ్ళు గుమ్మాలు దాటి వచ్చేవారు కాదు. మగాళ్ళు ఏ పని చేస్తున్నా ఆపి నమస్కారం పెట్టాల్సిందే! లేకపోతే కరణం ఎక్కడో మెలికి పెట్టి దెబ్బ కొట్టాడన్నమాటే. నరం మీద కురుపులా సలపరింత పెట్టేవాడు కరణం పాపయ్య పగబడితే! అందుకే కరణం పాపయ్యంటే ఊళ్ళో జనానికి భక్తి కన్నా భయం ఎక్కువ.

క్రొత్తగా ముండమోసినందువల్ల కరణం బయటకు రావడం లేదు. వేపచెట్టు క్రింద మంచం వాల్చుకుని దీర్ఘాలోచనలో ఉంటున్నాడు.

పెళ్ళి చెయ్యాల్సిన ఆడపిల్లలిద్దరున్నారు బంతి చెట్లలా ఎదిగి. కొడుకుని డొనేషన్ కట్టి ఇంజనీరింగ్‌లో చేర్పించాడు, మొన్నటికి మొన్న. ఇంట్లో తిండి ఖర్చు తగ్గేలా లేదు. వెధవప్పగారు పుట్టింట్లోనే మకాం. ఆమెకు పిల్లల్లేరు. ఆస్థి లేదు. మొదట్నుంచీ రెండు కూరలు, పప్పు, పచ్చడీ, ముద్ద ముద్దకూ నెయ్యి, గంట గంటకీ చిక్కటి పాలతో కాఫీ త్రాగడం, రోజూ ఏదో పిండివంట, వచ్చేవాళ్ళు, పొయ్యేవాళ్ళు - దేవిడీలా జరుగు దలకు అలవాటుపడ్డ కుటుంబం.

ముందెలా?

ఉన్నది రెండెకరాలు!

మరో పని చెయ్యడం రాదు.

ఇంట్లో ఖర్చు తగ్గదు!

ఊళ్ళో పలకరించే దిక్కు లేదు! పైగా, కుర్రోళ్ళు 'కరణపోడు వస్తున్నాడ్రోయ్!' అని నవ్వడం ఎగతాళిగా. జడ్జీగా బ్రతికిన వాడు, ముద్దాయి అయితే ఎలా వుంటుందో అలా అయింది కరణం పాపయ్య పరిస్థితి.

ఆలోచిస్తునే వున్నాడు, రాత్రింబవళ్ళు ఆ వేప చెట్టు క్రింద పడుకుని - ఏం చెయ్యాలి

- ఎలా బ్రతకాలీ అని?

రాత్రిళ్ళు కరణం ఇంటి ముందు రచ్చబండ దగ్గర జనం చేరి ఎన్నికల గురించి, పార్టీల గురించి చర్చలు - నవ్వులు.

ఎండాకాలం. జనానికి పనీ పాటలు లేవు. చొల్లు కబుర్లు, సినిమాలు, రాజకీయాలు! రోజూ ఊకదంచినట్లు చర్చలు అర్థరాత్రి దాకా!

కరణానికి భవిష్యత్తు గుర్తుకొచ్చి నిద్ర పట్టదు. నిద్రపట్టే సమయానికి రచ్చబండ దగ్గర అరుపులు కేకలు, ఇకఇకలు పకపకలు.

ఆలోచిస్తూ, ఆలోచిస్తూనే ఉన్నాడు కరణం పాపయ్య. వెన్నెల రోజులు పోయి అమావాస్య రోజులొచ్చాయి. రచ్చబండ దగ్గర రోజు రోజుకూ చర్చల్లో వేడి వాడి అందుకుంటున్నాయి. అయినా మాటలు తప్ప చేతులు కలవటంలా.

ఎండాకాలం కనుక అర్థరాత్రి దాటితే గాని ఊళ్ళో కరెంటు రాదు. రచ్చబండ దగ్గర చర్చలు మంచి వేడిగా ఉన్నాయి ఆ రోజు.

కరణం పాపయ్య ఆ రోజున తెంపు చేసుకున్నాడు. ఇంట్లో అంతా నిద్రలో ఉన్నారు. పాపయ్య లేచి పెద్ద బొంగు తీసుకుని ప్రహరీ గోడ మీదుగా బలంగా విసిరేశాడు, బయట రచ్చబండ దగ్గరున్న జనం మీదకు.

అంతే!

బొంగు ఇరుపక్షాలకూ ఒకేసారి తగిలింది. ఎదటి పక్షం కొట్టిందని ఇరుపక్షాలు ఆ రాత్రి అందిన ఆయుధాలతో కొట్టుకున్నారు. తలలు పగిలాయి. తెల్లారేసరికి ఇరుపక్షాల్లోను సమంగా క్షతగాత్రులు తేలారు.

ఆ రోజు కరణం గడ్డం గీసుకుని ఇస్త్రీ గుడ్డలేసుకుని కత్తెర మార్కు సిగరెట్ కాలుస్తూ మళ్ళీ సింహాసనం ఎక్కాడు.

ఒక పక్షం కరణం దగ్గర కొచ్చారు, చేతులు కట్టుకుని డబ్బు మూటతో. 'ఆ నాకొడుకులు అంతు తేల్చాలి. డబ్బు గురించి భయం లేదు. మీరు ముందుండి నడపాలి' అని విన్నవించుకున్నారు.

కరణం పాపయ్య నవ్వాడు. నవ్వి, "చూస్తారుగా నా తడాఖా, అవతలవాళ్ళు ఈ దెబ్బతో మట్టి కరవాలి" అన్నాడు ప్రకాశముగా. మనసులో అనుకున్నాడు - మీ పనీ అంతే అవుతుందిలే".

ఆ తర్వాత కరణం కూతుళ్ళ పెళ్ళిళ్ళు ఘనంగా చేశాడు. కొడుకు ఇంజనీరింగు పూర్తి చేశాడు.

కేసు నడుస్తూనే వుంది ఇంకా.

కరణం మాయ తెలుసుకున్నోడు మున్సబు ఒక్కడే. అతను తోడు దొంగే కనుక ఎవరికీ చెప్పలేదు - చెప్పడు - నోరు జారితే కరణం పోటు పొడుస్తాడన్న భయంతో. ●